క్లుప్తంగా

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి వేదికపై ఉంచి పూజలు చేసి మేళతాళాలు, మంగళవాయిద్యాలు భక్తజనసందోహం మధ్య కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మత్రివాడ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో కల్యాణతంతు నిర్వహించగా పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కనులపండువగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

మండవల్లి: మండలంలోని లింగాలలో కొలువై ఉన్న శ్రీ గంగా విశాలాక్షి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దివ్యలీలా కల్యాణం బుధవారం రాత్రి 11 గంటలకు నిర్వహించారు. మున్నలూరి దుర్గాప్రసాద్ దంపతులు కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో యాజ్ఞికులుగా శ్రీమాన్ కాశీవరప్రసాద్ వ్యవహరించారు. ఆలయ అర్చకులు సుదర్శన శరత్‌బాబు భక్తులతో పూజలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈఓ కొవ్వాడ దివ్యశ్రీ పాల్గొన్నారు.

వేడుకగా గ్రామోత్సవం

లింగాల గ్రామంలో శ్రీ గంగా విశాలాక్షి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి వారి కల్యాణం ముగిసిన సందర్భంగా గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి టెంకాయలు, బియ్యం, నగదు సమర్పించారు.

మొవ్వ మండలానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



మొవ్వ: పాఠశాలల పునః ప్రారంభానికి మూడు వారాల ముందే పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులకు 3,760, తొమ్మిదో తరగతికి 6,006, పదవ తరగతికి 4,521 పాఠ్య పుస్తకాలు మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాక్ రూమ్‌కు చేరుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎస్.శివశంకర్ గురువారం తెలిపారు. సీఆర్‌పీలు శ్రీమన్నారాయణ, తాతా సమర్పణరావు, నాగరాజు, కృష్ణార్జునరావు, నాగ హిమజ, ఆంజనేయులు ఆధ్వర్యంలో పుస్తకాలను భద్రపరిచారు.

ఉపాధి హామీతో బహుళ ప్రయోజనాలు



మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో రైతులకు బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయని ఎంటీఏ ఎస్.నవీన్ అన్నారు. మండలంలోని లింగాలలో రూ.68 వేల ఉపాధి నిధుల వ్యయంతో 68 మంది కూలీలతో గురువారం పంట కాలువ అభివృద్ధి పనులు నిర్వహించారు. కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందని ఎంటీఏ తెలిపారు. దీంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి
- గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్
- శ్రీకాళహస్తి కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్

గుడివాడరూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ హెచ్చరించారు. గుడివాడ రూరల్ మండలం మల్లాయపాలెం పరిధిలో ఉన్న శ్రీకాళహస్తి కాలనీలో గుడివాడ తాలూకా పోలీసులు చేపట్టిన కార్డన్ సెర్చ్‌ను గురువారం డీఎస్పీ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుడివాడ డివిజన్‌లోని పోలీసులందరం అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసిందని, కౌంటింగ్ సమయంలో కూడా ఎటువంటి గొడవలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. దీనిలో భాగంగా గుడివాడ డివిజన్‌లోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో ముమ్మరంగా కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరూ మారణాయుధాలు కలిగి ఉండకూడదన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కె.ఏసుబాబు, గుడివాడరూరల్, నందివాడ ఎస్ఐలు ఎల్ఎస్ఎన్ మూర్తి, చంటిబాబు, ఆయా పోలీసుస్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి కాలనీలో పోలీసులు చేస్తున్న కార్డన్ సెర్చ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్



అలీనఖీపాలెంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్న సీఐ కిషోర్‌బాబు, పోలీసులు

సమస్యాత్మక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు

పమిడిముక్కల: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న అల్లర్లు, గొడవలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు మండలంలో సమస్యాత్మక గ్రామాలు, అనుమానిత ప్రదేశాల్లో గురువారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో పమిడిముక్కల సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తోట్లవల్లూరు, కూచిపూడి ఎస్ఐలు, పమిడిముక్కల సర్కిల్ పోలీస్ సిబ్బందితో కలిసి అలీనఖీపాలెం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సరైన పత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల అనంతరం గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, హింసాయుత సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణం ఉండేలా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, బాణసంచా అక్రమ నిల్వలు ఉంచిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి వారి సమాచారం తమకు తెలియజేస్తే, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ముదినేపల్లిరూరల్: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ డి.వెంకటకుమార్ కోరారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో గురువారం మైక్ ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మండలంలో 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. ఈ కారణంగా బహిరంగ సభలు, సమావేశాలు, ఆత్మీయ సమావేశాలు నిషేధించినట్లు చెప్పారు. కూడలి ప్రాంతాల్లో ప్రజలు గుంపులుగుంపులుగా ఉండరాదన్నారు. ఎన్నికల ఫలితాలపై ఎలాంటి బెట్టింగులకు పాల్పడవద్దని, వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తోట్లవల్లూరులో వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



ముదినేపల్లి గ్రంథాలయంలో నీతి కథలను ఆసక్తిగా వింటున్న విద్యార్థులు



కలిదిండి గ్రంథాలయంలో చెస్ ఆడుతున్న విద్యార్థులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు బ్రాంచి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి బాబూరావు కోరారు. స్థానిక బ్రాంచి గ్రంథాలయంలో జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా చిన్నారులకు పుస్తక పఠనం, కథ చెప్పించటం, చదివించటం, పుస్తక సమీక్ష, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, డ్రామా, స్పోకెన్ ఇంగ్లిష్, కవితలు, సులువుగా గణితం నేర్పించటం, సంగీతం, డ్యాన్స్, భగవద్గీత శ్లోకాలు, చదరంగం, యోగా, క్యారమ్స్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని చెప్పారు.

గ్రంథాలయాల్లో ఉల్లాసంగా వేసవి శిక్షణ తరగతులు

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఆట పాటలతో పాటు పుస్తక పఠన పోటీలు నిర్వహించారు. విజ్ఞాన శిబిరాల పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బాల బాలికలు చక్కగా వినియోగించుకుంటున్నారని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరానికి అపూర్వ స్పందన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన కన్పిస్తోంది. మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులు ఈ శిబిరానికి అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులకు స్థానిక ఉపాధ్యాయుడు పసుమర్తి సత్యనారాయణ నీతికథలు బోధించారు. విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంచే కథలను ఎంపిక చేసుకుని బోధించారు. మరో ఉపాధ్యాయురాలు పరసా అంకిత విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ గురించి తెలియజేశారు. అనంతరం గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి విద్యార్థులతో పలురకాల ఆటలు ఆడించి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు నీతి కథల బోధన

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విదార్థులకు గురువారం నీతికథలను గ్రంథాలయాధికారి షేక్ పర్వీనా బోధించారు. జనరల్ నాలెడ్జ్ కాంపిటీషన్ నిర్వహించారు.

కలిదిండిలో...

కలిదిండి: విద్యార్థులకు గ్రంథాలయాలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు కోరారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం, చెస్ పోటీలను నిర్వహించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే శిబిరాల ముఖ్య ఉద్దేశమని అన్నారు.

బుద్ధుని బోధనలు ప్రపంచానికే ఆదర్శం

మండవల్లి: గౌతమ బుద్ధుడి బోధనలైన శాంతి, సహనం, అహింస, ప్రేమ, దయ, కరుణ మార్గాలు ప్రపంచానికే ఆదర్శమని అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె.శాంతరాజు, గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. బుద్ధుని జన్మదినం సందర్భంగా గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద బుద్ధుని ఫొటో పెట్టి ఆ మహనీయుని అడుగుజాడల్లో నడచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కె.రవి వరప్రసాద్, చాబత్తిన విజయ్, జి.వెంకటేశ్వరరావు, ఎం.చక్రధర్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

గుడివాడ టౌన్: స్థానిక పాత బైపాస్ రోడ్‌లోని బౌద్ధ స్థూపం వద్ద గురువారం బుద్ధ భగవానుని 2,568వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు వక్తలు బుద్ధ భగవానుని గొప్పతనాన్ని, బౌద్ధ మతం విలువలను వివరించి ప్రతి ఒక్కరూ వాటిని ఆచరించడం వలన సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు. గుడివాడ పట్టణంలోని అతి పురాతనమైన బౌద్ధ ఆరామంలో నేడు ఆయన జయంతి వేడుకలు జరుపుకోవడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో బౌద్ధ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, బామ్‌సెఫ్ రాష్ట్ర నాయకులు సర్వేశ్వరరావు, రాజ్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు నీలం ప్రభాకరరావు, బొడ్డు విల్సన్, దారం కరుణాకర్, బి.కార్తీక్ రామ్ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో బుద్ధ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బామ్‌సెఫ్ నాయకులు

సాయినాథునికి దీపార్చన

పామర్రు: స్థానిక విజయవాడరోడ్డులోని బుచ్చమ్మ ఆశ్రమంలో ఉన్న శ్రీ సాయినాథుని మందిరంలో వైశాఖ మాసం గురువారం పురస్కరించుకుని దీపాలతో అర్చన చేశారు. తొలుత బాబాకు ప్రత్యేకంగా పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి, శత సహస్ర నామాలతో పూజాదికాలను చేశారు. ఆలయ అర్చకుడు కార్తీక్ ఆధ్వర్యంలో భక్తులు దీపాలతో అర్చన నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలవడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం మానికొండ అడ్డరోడ్డుకు చెందిన కుందేటి నాగలక్ష్మి పోరంకి పచ్చళ్ల కంపెనీలో పని చేస్తుంది. ఆమె పనికి రావడానికి సోదరుడి బైక్‌పై పోరంకికి బయలుదేరింది. అయితే వారు ప్రయాణిస్తున్న బైక్ గంగూరు పెట్రోల్ బంక్ వద్దకు రాగా గుర్తు తెలియని మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగలక్ష్మి తలకు గాయమైంది. ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన కోలాట ప్రదర్శన



ఎలకుర్రు(పామర్రు): గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు.స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. తొలుత ఆలయంలో స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు, కోలాట బృందానికి సన్మానం చేశారు. కార్యక్రమంలో స్థానికులు ముదిగొండ శాస్త్రి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయులుకు ఘన సత్కారం



గుడివాడటౌన్: ఫెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ కార్యాలయంలో డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులును గురువారం ఘనంగా సత్కరించారు. ఈనెల 19వ తేదీన ఒంగోలులో తెలుగు వెలుగు జాతీయ సంస్థ ఆయనను మహానంది పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఫెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ ఏడీ జన్ను చిరంజీవి రావు, డీఆర్‌బీ ప్రసాదు, డి.విజయ రాంబాబు, సయ్యద్ గఫార్, మోకా మాధవరావు, గాదె మోహన్‌బాబు, అవిర్నేని వెంకటేశ్వరరావు, జి. శ్రీనివాసరావు, బి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

పెదపారుపూడి: మండల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అన్ని గ్రామాల్లో ప్రతి జాబ్‌కార్డు దారుడికి 100 రోజుల పని కచ్చితంగా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్డీ వి. శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన మీసాల వెంకన్నస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కైకలూరు: మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు సాగిన వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు స్వామివారికి చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీనివాసుల లక్ష్మణ ప్రవీణ్, బృందావనం లక్ష్మీనృసింహాచార్యులు, గోపి కృష్ణమాచార్యులు, అగ్నిహోత్రం మిథునాచార్యులు పూజా కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తోట్లవల్లూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని భద్రిరాజుపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెం గ్రామానికి చెందిన చిల్లపల్లి కనకయ్య(58) ఈ నెల 21వ తేదీ సాయంత్రం తన మోపెడ్‌పై భద్రిరాజుపాలెం నుంచి ఉయ్యూరు వెళుతున్నాడు. భద్రిరాజుపాలెం దళితవాడ వద్ద ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో కనకయ్య వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కనకయ్య తలకు, కాళ్లకు గాయాలు కావటంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. భార్య చిల్లపల్లి దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ గురువారం తెలియజేశారు.

ఆనంద, ఆరోగ్యకర జీవనానికి యోగా

జమీగొల్వేపల్లి(పామర్రు): ఆనంద, ఆరోగ్యకర జీవనానికి యోగా ఉపకరిస్తుందని ప్రముఖ యోగా గురువు పొట్లూరి వెంకట ధర్మారావు అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణలో భాగంగా యోగా, ధ్యానంపై అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాల ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పొందగలుగుతారని అన్నారు. యోగా అనేది మన సంస్కృతిలో భాగమని అన్నారు. ధ్యానం ద్వారా ప్రశాంతతతో కూడిన మనస్సుకు చక్కటి ఏకాగ్రత, స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీవి వంశీకృష్ణ, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో...

విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని పామర్రు ద్వితీయ శ్రేణి గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థినులకు నృత్యంలో శిక్షణ, పొడుపు కథలు చెప్పించినట్లు చెప్పారు.



జమీగొల్వేపల్లిలో విద్యార్థులకు యోగా నేర్పుతున్న గురువు ధర్మారావు

సమస్యల పరిష్కారానికి చర్యలు

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ గద్దే పుష్పరాణి

గుడివాడరూరల్: మండలంలో సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గద్దే పుష్పరాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత వివిధ శాఖల పురోగతి, పనితీరులను ఆయా శాఖల మండల అధికారులు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అన్ని చర్యలు చేపడుతున్నామని సమావేశంలో వివరించారు. సార్వాసాగుకు సంబంధించి రైతులకు అందజేస్తున్న విత్తనాలు, పురుగు మందుల గురించి మండల వ్యవసాయశాఖ కె.అనంతలక్ష్మి సమావేశంలో వివరించారు. ఎంపీపీ, ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, కోడ్ పూర్తి కాగానే మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి, చిత్రంలో ఎంపీపీ, ఏఎంసీ చైర్‌పర్సన్

విజయానికి చేరువలో వైఎస్సార్‌సీపీ



డీఎన్నార్‌ను పార్టీ కార్యాలయంలో కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించనుందని ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు గురువారం ఏలూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డీఎన్నార్‌ను కలిశారు. ఇటీవల పోలింగ్ జరిగిన తీరుపై ప్రతి మండలం నుంచి విశ్లేషించారు. రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథం, ఘంటసాల శేషారావు, ఉప్పలపాటి జయదేవ్, తోట మహేష్, గంగుల అశోక్, ఆటో యూనియన్ నాయకుడు శ్రీను, కైకలూరు సత్యసాయి సేవా సమితి సభ్యులు డీఎన్నార్‌ను కలసిన వారిలో ఉన్నారు.

ఘనంగా సహాయమాత మహోత్సవాలు

ముదినేపల్లి రూరల్: స్థానిక ఆర్సీఎం చర్చిలో సహాయ మాత మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. చర్చి స్థాపించి 55 ఏళ్లు ముగిసిన సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించి బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా గురుశ్రీలు మాతంగి మరియకుమార్, రెంటాల విజయ్ ఆధ్వర్యంలో ఆరాధన, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ థోమస్ అమల్ ఫ్రొన్ చందుబాలు ఈ ప్రార్థనల్లో పాల్గొని ప్రసంగించారు. ఈ మహోత్సవాలకు పలు గ్రామాల నుంచి అనేక మంది విశ్వాసులు వచ్చి పాల్గొన్నారు. శుక్రవారం జరిగే ముగింపు వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఫాదర్ మరియకుమార్ కోరారు.

తాడిగడపలో ఆలయ భూములు కౌలు వేలం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన భూముల కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ రావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు తెలుపుతూ ఆర్ఎస్ నెంబర్ 133లో దేవస్థానానికి చెందిన సాగుభూమి 8.72 ఎకరాలు 3 సంవత్సరాలకు అనగా 2024–2025 నుంచి 2026–2027 మార్చి 31వ తేదీ వరకు కౌలు వేలం ఉంటుందన్నారు. దీనికిగాను ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట ఉంటుందన్నారు.